అధ్వానంగా పారిశుధ్యం


ప్రభుత్వ పాఠశాలలకు, వైద్యశాలకు వెళ్లే రోడ్డు పక్కన చెత్తాచెదారం


మూలమలుపు వద్ద చిల్లకంప

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. చుట్టుపక్కల ఇంటి యజమానులు చెత్తాచెదారం రోడ్డు పక్కన వేయడంతో అపరిశుభ్రంగా తయారైంది. ఈ రహదారిలో జెడ్పీహెచ్, ఎంపీపీ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోగులు, పొలాలకు రైతులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు ప్రజల్లో ఇంకా అవగాహన కల్పించక పోవడంతో రహదారి ఇరువైపులా స్థానికులు బహిర్భూమికి కూర్చోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి చివర ఉన్న గృహాల వారు వృథా చెత్త, చిరిగిన బట్టలు, ప్లాస్టిక్ సంచులు వేస్తున్నారు. ఈ రోడ్డులో విద్యార్థులు, ఉపాధ్యాయులు, రోగులు, రైతులు వెళ్లాలంటే భయపడే పరిస్థితి ఏర్పడింది. రోడ్డుకు ఇరువైపులా, బ్రిడ్జి దగ్గర మూలమలుపు వద్ద చిల్లకంప రహదారిని మూసుకు పోవడంతో రాకపోకలు సాగించాలంటే భయం భయంగా ఉందని విద్యార్థులు వాపోతున్నారు. మూలమలుపు వద్ద ఎదురు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. చెట్ల మధ్య నుంచి పాములు, తేళ్లు రోడ్డుపైన సంచరిస్తుంటాయని విద్యార్థులు తెలిపారు. రోడ్డుపక్కన చెత్తాచెదారం ఉండటంతో చిన్నపాటి వర్షం కురిసినా దుర్వాసన వెదజల్లుతోంది. ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పంచాయతీ అధికారుల పర్యవేక్షణ లోపంతో చెత్తా చెదారం రోడ్డు పక్కన సమీపంలో ఉన్న ఇంటి యజమానులు వేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్తా చెదారం తొలగించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిల్లకంపను తొలగించాలని విద్యార్థులు, ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఆధార్ సేవలు ప్రారంభం


ఆధార్ సేవలు పొందుతున్న ప్రజలు

కురిచేడు: మండల ప్రజలు ఆధార్ సర్వీసులు పొందేందుకు రెండేళ్లుగా అనేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇక్కడ సచివాలయంలోని ఆధార్ కేంద్రంలో పనిచేసిన వేణు బదిలీ కావటంతో ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి. ప్రజల అభ్యర్థన మేరకు మండల అధికారులు వారం రోజుల నుంచి మండల కేంద్రం కురిచేడు సచివాలయంలో ఆధార్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆపరేటర్ రాజశేఖర్ తెలిపారు. పుట్టిన తేదీ, పేర్ల మార్పులు, చేర్పులు, చిరునామా మార్పు, ఆధార్ అప్‌డేట్స్, ఆధార్‌కు సంబంధించిన అన్ని సేవలు అందుబాటులో ఉన్నట్లు ఆయన తెలిపారు. మండల ప్రజలు, విద్యార్థులు ఆధార్ సేవలు వినియోగించుకోవాలని కోరారు.

దర్శి బాలునికి ఆర్థిక సాయం


చెక్కు అందిస్తున్న కలెక్టర్

ఒంగోలు సబర్బన్: దర్శి పట్టణానికి చెందిన గల్లెపోగు యలమంద, ప్రశాంతి దంపతుల 5 సంవత్సరాల కుమారుడికి కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా రూ.1.50 లక్షల విలువైన చెక్కు అందించారు. ఆ చిన్నారి పోలియోతో బాధపడుతున్న నేపథ్యంలో స్థానిక కలెక్టర్ చాంబర్‌లో సోమవారం చెక్కు అందజేశారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ


నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

దర్శి: లయన్స్ క్లబ్ ఆఫ్ దర్శి స్నేహ ఆధ్వర్యంలో ఎస్‌ఎస్సీ కాలనీ వద్ద నివాసం ఉంటున్న ముగ్గురు నిరుపేద కుటుంబ సభ్యులకు సోమవారం నెలకు సరిపడా నిత్యావసరాలు పంపిణీ చేశారు. పది వేల రూపాయల విలువైన నిత్యావసర సరుకులు , పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్యాట్ మార్కెటింగ్ కో ఆర్డినేటర్ లయన్ కల్లూరు విద్యాసాగర్ రెడ్డి, జోనల్ చైర్మన్ కోట హనుమంతురావు, క్లబ్ సెక్రటరీ పానుగంటి సత్యనారాయణ గుప్తా, ట్రెజరర్ గుడిపాటి అశోక్, క్లబ్ సభ్యులు చింతా తిరుపతిరెడ్డి, అంబటి గోవిందరెడ్డి, యనుమల నర్సారెడ్డి, ఏఎస్ఎం సుశీల పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం నేరం


మాట్లాడుతున్న ఈఈ శ్రీనివాసులు

దొనకొండ: విద్యుత్ వినియోగదారులు చౌర్యానికి పాల్పడటం నేరమని, వారిపై కేసు నమోదు చేస్తామని దర్శి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని గ్రామాల్లో 36 బృందాలుగా విద్యుత్ సిబ్బంది ఏర్పడి తనిఖీలు చేశారు. నివాసాలు, షాపుల్లో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారుల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడిన 40 మందిపై కేసు నమోదు చేసి రూ.1,69,300 జరిమానా విధించారు. కొంత మంది వాణిజ్య వినియోగదారులకు లోడు క్రమబద్ధీకరించుకునేందుకు నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసులు విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో వరుసగా 6 నెలలు విద్యుత్ బిల్లులు చెల్లించకుంటే వెంటనే తొలగించాలన్నారు. సిబ్బంది ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించాలన్నారు. ప్రమాదాలు జరిగితే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. రైతులు పొలాల్లో పందులను నివారించేందుకు విద్యుత్ తీగలు వేయకుండా సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలన్నారు. దొనకొండలో విద్యుత్ సమస్య ఎక్కువగా ఉందని, జాగ్రత్తగా ఉండి సరఫరా సక్రమంగా ఇవ్వాలన్నారు. విద్యుత్ దొనకొండలో ఎక్కువ భాగం ట్రిప్ అవుతుందని, అలా జరగకుండా తగ్గించి మెరుగైన విద్యుత్ అందించాలన్నారు. విద్యుత్ తీగాపై చిల్ల చెట్లు ఉంటే ప్రమాదాలు జరుగుతాయని, సిబ్బంది వెంటనే గమనించి చిల్లచెట్లు తొలగించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఒంగోలు సర్కిల్ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సి.హైమావతి, పొదిలి సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.హరిబాబు, స్థానిక ఏఈ షేక్ నాగూర్, ఇతర మండలాలకు చెందిన 8 మంది ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగులను నులిమేద్దాం..రండి!

● నేడు నులిపురుగుల నివారణ దినోత్సవం

పుల్లలచెరువు: చిన్నారుల్లో నులిపురుగుల సమస్య వారిని కుంగదీస్తోంది. అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. నులిపురుగులు ప్రభావం చిన్నారుల్లో అనేక పరిస్థితులను ప్రభావితం చేస్తాయి. శారీరక ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రక్త హీనతకు కారణమవుతుంది. ఈ నెల 12వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని 1–19 ఏళ్ల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసేందుకు మండల వైద్య శాఖాధికారులు చర్యలు చేపట్టారు. మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, ఆశ్రమ పాఠశాలలు, కాలేజీలు, బడిబయట ఉన్న పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయనున్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో దాదాపు 11500 మందికి మాత్రలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మండలంలో గుర్తించిన పిల్లలందరికీ ఆల్‌బెండజోల్ మాత్రలు వేయనున్నారు. పంపిణీ కార్యక్రమం మూడు రోజుల పాటు జరుగుతుంది.

వాడాల్సిన విధానం

1 నుంచి 2 సంవత్సరాల చిన్నారులకు సగం మాత్ర, 2–3 ఏళ్ల వారికి పూర్తి మాత్ర, 3–19 ఏళ్ల పిల్లలు ఒక మాత్ర నమిలి మింగాలని వైద్యులు చెబుతున్నారు. పిల్లలు చేతులు శుభ్రంగా చేసుకోకుండా భోజనం చేయడం, మట్టిలో ఆడుకోవడం వంటి కారణాలతో 1–19 ఏళ్ల పిల్లల కడుపులో నులిపురుగులు తయారవుతాయి. అవి కడుపులో రక్తాన్ని పీల్చడంతో పాటు పిల్లల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. తరుచూ అనారోగ్యం బారిన పడడం, బరువు తగ్గడం, ఎత్తుకు తగ్గ బరువు ఉండక పోవడంతో పాటు చురుకుదనం కోల్పోతారు. ప్రస్తుతం గ్రామాల్లో ఇలాంటి పిల్లలు అధికంగా ఉంటుంటారు. తప్పక మాత్రలు వాడుకోవాలని అధికారులు చెబుతున్నారు.

> **మాత్రలు విధిగా మింగించాలి**
> మండలంలోని అన్ని గ్రామాల చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు తప్పక మింగించాలి. గ్రామాల్లోని వైద్య సిబ్బందికి కూడా తగిన ఆదేశాలు ఇచ్చాం. ఈ కార్యక్రమంపై అశ్రద్ధ చేయకుండా నూరు శాతం పూర్తి చేయాలి. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని చిన్నారులతో తప్పకుండా మాత్రలు మింగించాలి. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలి.
> – ఎస్.శ్రీనాథ్, ప్రభుత్వ వైద్యాధికారి, పుల్లలచెరువు

ఘనంగా పోలేరమ్మ కొలుపులు


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ అమ్మవారు


పొంగళ్లు సమర్పిస్తున్న మహిళలు

తాళ్లూరు: మండలంలోని నాగంబొట్లపాలెంలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న పోలేరమ్మ తల్లి కొలుపులు సోమవారం ఘనంగా ముగిశాయి. గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో సంప్రదాయ పద్ధతులతో పూజలు చేశారు. ముందుగా అమ్మవార్లను పూలతో అలంకరించారు. పసుపు-కుంకుమ, చీర, సారె పెట్టుకున్నారు. మహిళలు పొంగళ్లు, నైవేద్యాలు, పండ్లు సమర్పించారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

సీఐటీయూ కన్వీనర్‌గా అంజయ్య


అంజయ్య (ఫైల్)

దొనకొండ: సీఐటీయూ మండల కన్వీనర్‌గా చిరుపల్లి అంజయ్యను ఎన్నుకున్నారు. ఈ మేరకు జిల్లా ఉపాధ్యక్షుడు తాండవ రంగారావు ధ్రువీకరించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ కార్మికులకు అండగా ఉంటానని చెప్పారు. కార్మికుల సమస్యలు జిల్లా కమిటీకి తెలియజేసి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

ఖరీఫ్‌లో పంటల సాగుపై అవగాహన ఉండాలి

తాళ్లూరు: ఖరీఫ్‌లో వేసే ప్రతి పంటపై రైతులు అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయాధికాలు వీవీ శేషమ్మ, బి.ప్రసాద్‌రావు అన్నారు. మండలంలోని కొర్రపాటివారిపాలెం రైతు సేవా కేంద్రంలో ఖరీఫ్‌లో రైతులు సాగు చేసే పంటలపై సోమవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు ఉపయోగించి సాగుకు అనుకూలించే పంటలు వెయ్యాలని సూచించారు. అనంతరం విత్తనాల సరఫరా, పంట నమోదు, ఇతర అంశాల గురించి వివరించారు. ఎంపీటీసీ సభ్యుడు యామర్తి ప్రభుదాస్, రైతులు పాల్గొన్నారు.

లైసెన్స్ ఉన్న నర్సరీల్లోనే మొక్కలు కొనాలి


నర్సరీలో మొక్కలు పరిశీలిస్తున్న ఆదిరెడ్డి

త్రిపురాంతకం: షేడ్ నెట్ నర్సరీ యజమానులు రిజిస్ట్రేషన్ చేయించుకుని లైసెన్స్ కలిగి ఉండాలని, అలా లేని నర్సరీలపై చర్యలు తప్పవని ఉద్యానవన శాఖ అధికారి ఆదిరెడ్డి హెచ్చరించారు. మండలంలోని సోమేపల్లి నర్సరీలను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల్లో పెంచే మొక్కలు, మిరప విత్తనాలు ఆధీకృత డీలర్ల వద్ద కొనుగోలు చేయాలన్నారు. బిల్లులు లేకుండా విత్తనాలు కొనుగోలు చేసి మొక్కలు పెంచితే చర్యలు తప్పవన్నారు. మొక్కలు కొనే రైతులు అనుమతులు ఉన్న నర్సరీల్లో మాత్రమే కొనుగోలు చేయాలని ఆదిరెడ్డి సూచించారు.

పొంగిన దొంగలవాగు


కొత్తూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న దొంగలవాగు

పెద్దదోర్నాల: నల్లమల అభయారణ్యంలో గత రాత్రి భారీగా కురిసిన వర్షంతో మండల పరిధిలోని పలు వాగులు పొంగి ప్రవహించాయి. దీంతో పలు చోట్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మండల పరిధిలోని దొంగలవాగు ఉధృతంగా ప్రవహించడంతో కర్నూల్ రహదారి కొత్తూరు వెలుగొండ ప్రాజెక్టు సొరంగ నిర్మాణ ప్రాంతం వద్ద సోమవారం ఉదయం గంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో పలు వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ఆయా వాహనాల్లో ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు.

త్రిపురాంతకం గడ్డ..జగనన్న అడ్డా!


క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి, వైఎస్సార్ సీపీ నేతలు


బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

● త్రిపురాంతకేశ్వరుడి ఆశీస్సులతో రెపరెపలాడిన వైఎస్సార్ సీపీ జెండాలు
● ఎమ్మెల్యే తాటిపర్తిని ఘనంగా ఆహ్వానించిన నాయకులు

త్రిపురాంతకం (యర్రగొండపాలెం): త్రిపురాంతకేశ్వరుడి ఆశీస్సులతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాలు రెపరెపలాడాయి. సోమవారం త్రిపురాంతకంలోని ఆర్యవైశ్య నిత్య అన్నదాన సత్రంలో ఏర్పాటు చేసిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బస్టాండ్ సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. ఈ తరుణంలో వర్షం జల్లులు కురవడం ప్రారంభమయ్యాయి. దాదాపు 3 కిలో మీటర్ల దూరంలో ఉన్న సభాస్థలం వద్దకు ర్యాలీగా వెళ్లేందుకు చేసిన సన్నాహాలు విఫలం అవుతాయనుకున్నారు. అయితే త్రిపురాంతకేశ్వరుడు కరుణ చూపడంతో వర్షం జల్లులకే పరిమితమైంది. ఆ ఆనందోత్సాహంతో అక్కడ చేరిన యువకులు త్రిపురాంతకం గడ్డ జగనన్న అడ్డా.. తాటిపర్తి చంద్రశేఖర్ నాయకత్వం వర్ధిల్లాలి.. అంటూ నినాదాలు చేశారు. ముందుగా వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరిన ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌ను నాయకులు శాలువా కప్పి ఘనంగా ఆహ్వానించారు. ఆయన వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి వైఎస్సార్ సీపీ జెండాలు పట్టుకొని పట్టణ ప్రధాన వీధిలో ర్యాలీ చేశారు. త్రిపురాంతకేశ్వరుడి ఆలయానికి సమీపంలో ఉన్న సత్రంలో ఏర్పాటు చేసిన సభ వద్దకు యువకులు మోటారు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే మోటారు బైక్‌పై ఆ ర్యాలీలో పాల్గొని యువతలో నూతన ఉత్తేజాన్ని నింపారు. ర్యాలీలో జగన్ నినాదం మిన్నంటింది. 3 కిలోమీటర్ల వరకు సాగిన ర్యాలీని అభిమానులు, పార్టీ సానుభూతిపరులు చూసి ఎంతో ఆనందంగా కదం తొక్కారు. సభలో ఎన్నికల ముందు బాబు ఇచ్చిన ష్యూరిటీ పత్రాలను ప్రదర్శించే సమయంలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎంపీపీ ఆళ్ల సుబ్బమ్మ, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్, వైస్ ఎంపీపీ పాటిబండ్ల కృష్ణ, పార్టీ మండల కన్వీనర్లు సింగారెడ్డి పోలిరెడ్డి, గంటా వెంకటరమణారెడ్డి, ఏకుల ముసలారెడ్డి, పి.కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, మహిళా విభాగం జిల్లా కార్యదర్శి ఆర్.అరుణాబాయి, ముస్లి మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ బుజ్జి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వరరెడ్డి, ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు దొందేటి నాగేశ్వరరెడ్డి, మండల అధ్యక్షుడు పి.నాగేశ్వరరెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్, వివిధ విభాగాల నాయకులు రాచగొర్ల పిచ్చయ్య, ఆళ్ల కృష్టారెడ్డి, సయ్యద్ జబీవుల్లా, ఎస్.రంగబాబు, సాయిపునేని సుబ్బారావు, శార, షుక్రూనాయక్, కె.వెంకటేశ్వర్లు, కంభపు వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, కాశిరెడ్డి, నారాయణరెడ్డి, జి.బాలకోటిరెడ్డి, శాంబిరెడ్డి, బాలు నాయక్, నాసర్‌వలి, కోటి, మోహన్‌దాస్, మీరావలి, వెంకళరెడ్డి పాల్గొన్నారు.


ఎమ్మెల్యే తాటిపర్తిని గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

శ్రమజీవుల శంఖారావం విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న కరుణానిధి

దర్శి: ఒంగోలులో ఈ నెల 23వ తేదీన జరిగే శ్రమజీవుల శంఖారావం విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కరుణానిధి కోరారు. సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి కళాజాతా ప్రజలను చైతన్య పరుస్తూ దర్శి గడియారం స్తంభం సెంటర్‌లో సోమవారం ప్రదర్శనలు ఇచ్చింది. ఈ సందర్భంగా కరుణానిధి మాట్లాడుతూ 100 సంవత్సరాల కమ్యూనిస్టు పార్టీ చరిత్రలో మొట్టమొదటిసారిగా ఒంగోలులో రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. మహాసభలకు సీపీఐ జాతీయ కార్యదర్శులు టి.రాజా, కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శులు కె. రామకృష్ణ, గుజ్జుల ఈశ్వరయ్య పాల్గొంటారన్నారు. 26 జిల్లాల నుంచి ఎర్రజెండా యోధులు జిల్లాకు వస్తున్నారని వివరించారు. ఆగస్టు 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ప్రజా కళా ఉత్సవాలు, ఆగస్టు 23వ తేదీన శ్రమజీవుల శంఖారావం పేరుతో గొప్ప భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. మహాసభకు దర్శి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. మహాసభల్లో నూతన కమిటీని ఎన్నుకుంటారని తెలిపారు.

రేపటి శాంతియుత ధర్నాను విజయవంతం చేయాలి

దర్శి: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ డిగ్రీ కాలేజ్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ అధ్వర్యంలో ఈ నెల 13న తాడేపల్లిలోని సోషల్ వెల్ఫేర్ కార్యాలయం వద్ద నిర్వహించే శాంతియుత ధర్నాను విజయవంతం చేయాలని అసోషియేషన్ రాష్ట్ర సెక్రటరీ డాక్టర్ పి.పెద్దిరాజు ఒక ప్రకటనలో కోరారు. రెండేళ్లుగా నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచడం శోచనీయమన్నారు. ఈ విషయమై అసోసియేషన్ నాయకులు పలుమార్లు ప్రభుత్వానికి పలు విధాలుగా విన్నవించినా ప్రభుత్వ పెద్దల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం విచారకరమన్నారు. రాష్ట్ర అసోసియేషన్ నాయకులు ఫిబ్రవరి 3వ తేదీన విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను కలిసి డిగ్రీ కళాశాలల సమస్యలు తెలియజేశామని, ఆ తర్వాత మెయిల్స్ ద్వారా కూడా లోకేష్‌కు అనేకమార్లు సమాచారం అందించినా పట్టించుకోలేదన్నారు. పెండింగ్ నిధుల గురించి గతంలో కూడా ప్రతి జిల్లాలో కలెక్టర్‌లకు వినతి పత్రాలు ఇచ్చామని గుర్తు చేశారు. ప్రభుత్వం పరిష్కరించాల్సిన డిగ్రీ కళాశాలల అకడమిక్ సమస్యలు కూడా చాలానే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డిగ్రీ కాలేజీలు నిర్వహించాలంటే సిబ్బంది జీతభత్యాలు, రవాణా, కళాశాల నిర్వహణ వంటి వ్యయ ప్రయాసలతో కూడిన ఆర్థిక సమస్యలు భరించలేక సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యార్థుల నుంచి ఎటువంటి ఫీజులు వసూలు చేయరాదని ఆదేశాలు ఇచ్చిందని, ఇలాంటి పరిస్థితుల్లో అటు ప్రభుత్వం పెండింగ్ ఆర్‌టీఎఫ్ నిధులు ఇవ్వకుండా, ఇటు కళాశాలలు ఫీజులు వసూలు చేసుకోకుండా, కళాశాలలు ఏ విధంగా నడపాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని చెప్పారు. డిగ్రీ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పెండింగ్ నిధులు అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ధర్నా చేస్తున్నట్లు పేర్కొన్నారు.